

గేదెల పంపిణీ హుళక్కేనా?
ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా వన్ ప్లస్ వన్ పాడి పశువుల పథకం ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.
8లో ▸



తిరుమంజనం
కొడంగల్‌లోని వేంకటేశ్వరాలయంలో సోమవారం గోదాదేవి అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు.
8లో ▸



పల్లెలకే 'పవర్'
గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిధుల వినియోగంలో పల్లెలకే అధికారం ఇచ్చింది.
9లో ▸

న్యూస్‌రీల్

శుభాకాంక్షలు



సీఎస్‌ను కలిసిన ఎంపీడీఓల సంఘం ప్రతినిధులు

అనంతగిరి: తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీఎస్ శాంతికుమారిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీడీఓలు శ్రీనివాసులు, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అందని 'కిట్లు'.. తప్పని పాట్లు

- నిలిచిన హెల్త్ అండ్ హైజీన్ కిట్ల పంపిణీ
- రెండేళ్లుగా ఆగిపోయినా సరఫరా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న కిషోర బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'హెల్త్ అండ్ హైజీన్ కిట్ల' పంపిణీ రెండేళ్లుగా నిలిచిపోయింది. ఫలితంగా జిల్లాలో 95,962 మంది బాలికలకు న్యాప్‌కిన్లు అందకుండా పోయాయి. నెలసరి సమయంలో బాలికలే సమకూర్చుకోవాల్సి వస్తోంది. కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు అనారోగ్యం పాలవుతుండగా, మరికొందరు ఆ సమయంలో స్కూలుకు గైర్హాజరవుతున్నారు. ఇది వారి అభ్యసన సామర్థ్యంపై ప్రభావం చూపుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

పాఠశాలలు పునఃప్రారంభమైనా..
ప్రభుత్వ పాఠశాలలతో పాటు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లలో చదువుతున్న 12–18 ఏళ్లలోపు బాలికల కోసం 2018–19 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం హెల్త్ అండ్ హైజీన్ కిట్ల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టింది. సబ్బులు, షాంపూలు, కొబ్బరి నూనె, టూత్ బ్రష్, పేస్ట్, టంగ్ క్లీనర్, న్యాప్‌కిన్లు, రిబ్బన్లు, దోమల నివారణ బిళ్లలు, హ్యాండ్‌వాష్ తదితర వస్తువులను కిట్ రూపంలో విద్యార్థినులకు ఉచితంగా అందజేసేవారు. ఒక్కో కిట్ విలువ రూ.400 కాగా ఏటా నాలుగుసార్లు అందజేయాలని నిర్ణయించారు. ఏడాది పాటు సక్రమంగా అమలు చేసినా కరోనా కారణంగా పాఠశాలలు మూతపడటంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. విద్యా సంస్థలు పునఃప్రారంభమై రెండేళ్లు కావస్తున్నా కిట్ల పంపిణీని మాత్రం తిరిగి ప్రారంభించలేదు. కిట్ల స్థానంలో డబ్బులు ఇవ్వాలని నిర్ణయించినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా అనేక మంది బాలికలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఈ నెల 30 వరకు ఉచిత బియ్యం పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది. ఈ– పాస్ సాంకేతిక సమస్య కారణంగా ఉచిత బియ్యం పంపిణీ ప్రక్రియ పది రోజులు ఆలస్యంగా ప్రారంభమైంది. కరోనా ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజికేఏవై) పథకం కింద 2020 ఏప్రిల్ నుంచి యూనిట్ (ఒక్కొక్కరికి) ఉచితంగా 5 కిలోల చొప్పున బియ్యం కోటా కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద యూనిట్‌కు మరో 5 కిలోలు కలిపి లబ్ధిదారుకు 10 కిలోల చొప్పున పంపిణీ చేశారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టం కింద ఈసారి కూడా ఎప్పటి మాదిరిగా 5 కిలోల చొప్పున బియ్యం కోటా కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి తన వాటా చేర్చకుండా యూనిట్‌కు 5 కిలోలకు పరిమితం చేసింది. ఈ– పాస్ యంత్రంలో యూనిట్‌కు 10 కిలోలు ఉన్న కారణంగా పంపిణీకి అడ్డంకిగా తయారైంది. తాజాగా ఈ– పాస్ యంత్రాల్లో యూనిట్‌కు 5 కిలోల చొప్పున మార్పిడికి కొంత సాంకేతిక సమస్య ఏర్పడింది. ఈ ప్రక్రియ పూర్తికి కొంత ఆలస్యమైనట్లు తెలుస్తోంది. దీంతో ఈ నెల కోటా 30 వరకు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారు.

19 వరకు చౌమహల్లా ప్యాలెస్ మూసివేత

చార్మినార్: అసఫ్ జాహీల రాచరిక పాలనకు అద్దం పట్టే విధంగా ఉన్న చౌమహల్లా ప్యాలెస్‌ను 5 రోజుల పాటు క్లోజ్ చేశారు. టర్కీలో మృతి చెందిన 8వ నిజాం నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ ముఖర్రం జా బహదూర్ భౌతికకాయాన్ని చౌమహల్లా ప్యాలెస్‌కు తరలించనున్నారు. ఈ నెల 17న సాయంత్రం నగరానికి ప్రత్యేక విమానంలో ఆయన భౌతిక కాయాన్ని తరలించిన అనంతరం చౌమహల్లా ప్యాలెస్‌కు తీసుకురానున్నారు. ముఖర్రం జా బహదూర్ భౌతికకాయాన్ని 18 వరకు ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. దీంతో ఈ నెల 15 నుంచి 19 వరకు పర్యాటకులకు అనుమతి లేదంటూ చౌమహల్లా ప్యాలెస్ ప్రధాన ద్వారం వద్ద నోటీస్ బోర్డు ఏర్పాటు చేశారు.

నీట మునిగిన బతుకులు



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- కోట్‌పల్లి ప్రాజెక్టులో మునిగి నలుగురు యువకుల దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు అన్నదమ్ములు, బావమరిది
- కన్నీటి సంద్రమైన మన్నెగూడ

ధారూరు: పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచే కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద సోమవారం విషాదఛాయలు అలుముకున్నాయి. పండుగ పూట సంతోషంగా గడిపేందుకు వెళ్లిన నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలచివేసింది. పూడూరు మండలం మన్నెగూడకు చెందిన సొంత అన్నదమ్ములు లోకేశ్, వెంకటేశ్, వీరి చిన్నాన్న కొడుకు జగదీశ్‌తో పాటు మేనత్త కొడుకు రాజేశ్ ప్రాజెక్టు నీటిలో మునిగి మృత్యువాత పడటం మన్నెగూడలో విషాదం నింపింది. చనిపోయిన యువకులందరూ అవివాహితులే. వీరిలో వెంకటేశ్ కూకట్‌పల్లిలోని కోర్టు కాంప్లెక్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా ఇతని తమ్ముడు వెంకటేశ్ ఇటీవల నిర్వహించిన ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించి, ఫైనల్ ఎగ్జామ్ కోసం చదువుతున్నాడు. వీరి మృతదేహాలను చూసేందుకు వచ్చిన మన్నెగూడ వాసులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు.

అవే చివరి క్షణాలు
మన్నెగూడకు చెందిన బాధిత కుటుంబంలోని తొమ్మిది మంది కోట్‌పల్లి అందాలను వీక్షించేందుకు వెళ్లారు. ప్రాజెక్టు చుట్టూ ఉన్న అడవిలో కొద్దిసేపు సరదాగా గడిపారు. అనంతరం ప్రాజెక్టు నీటిలో దిగి సంతోషంగా కేరింతలు వేశారు. ఇవే తమ జీవితంలో చివరి క్షణాలని ఆ నలుగురూ అనుకోలేదు. ఈత వచ్చిన లోకేశ్, జగదీశ్ దూరంగా ఉన్న బండరాయిని తాకి ఒడ్డుకు రావాలని పందెం వేసుకున్నారు. ఈతరాని ఏడుగురు మోకాళ్లలోతు నీరున్న ప్రాంతంలో ఎంజాయ్ చేస్తున్నారు. ప్రాజెక్టు నీటిలోని రాయిని తాకి ఒడ్డుకు వస్తున్న ఇద్దరిని చూసిన వెంకటేశ్, రాజేశ్.. వీరికి ఎదురుగా వెళ్లే ప్రయత్నంలో నీట మునిగారు. వీరిని కాపాడేందుకు ముందుకు వచ్చిన లోకేశ్, రాజేశ్‌ను గట్టిగా పట్టుకున్నారు. దీంతో నలుగురూ మృత్యువాత పడ్డారు.



ప్రమాదానికి ముందు ప్రాజెక్టు నీటిలో సరదాగా ఆడుతున్న యువకులు, కుటుంబ సభ్యులు

రక్షణ చర్యలు కరువు
కోట్‌పల్లి నీటిలో ఎంజాయ్ చేసేందుకు వస్తున్న వారిలో కొంతమంది ప్రాణాలు కోల్పోవడం బాధిత కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగులుస్తోంది. ఈత రాకపోయినా నీటిలో దిగుతున్న వారిలో కొంతమంది అత్యుత్సాహం ప్రాణాల మీదకు తెస్తోంది. ఇలా ఏటా పదుల సంఖ్యలో పర్యాటకులు మృత్యువాత పడటం కలకలం రేపుతోంది. వందలాది మంది పర్యాటకులు వస్తున్న ప్రాజెక్టు వద్ద కనీస అవగాహన కల్పించడం, ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడం అమాయకుల ప్రాణాలను బలిగొంటోంది. అరకొర సంఖ్యలో పోలీసులు గస్తీ కాస్తున్నా వందలాదిగా తరలివచ్చే పర్యాటకులను అదుపు చేయడం వీరి వల్ల కావడం లేదు.

కాపాడాల్సినవాడే.. కడతేర్చాడు

భార్య, కుమార్తె, తల్లిని చంపి.. తాను ఆత్మహత్య

కంటికిరెప్పలా ఇంటిల్లిపాదినీ కాపాడుతూ.. కుటుంబానికి అండగా ఉండాల్సినవాడే దారుణానికి ఒడిగట్టాడు. కన్నతల్లిని, కట్టుకున్న ఇల్లాలిని, అభమూ శుభమూ తెలియని కన్న కూతురునూ కడతేర్చాడు. కడకు తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

- నగరంలోని తార్నాకలో ఓ ప్రైవేట్ ఉద్యోగి ఘాతుకం
- చెన్నై వెళ్లేందుకు కుటుంబం నిరాకరించడంతో దారుణం
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు





ప్రతాప్, సింధూర, ఆధ్య (ఫైల్ ఫొటోలు)

సాక్షి, సిటీబ్యూరో/ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసుస్టేషన్ పరిధిలో ఘోరం జరిగింది. తనతో చెన్నై రావడానికి నిరాకరించిన భార్యతో పాటు కుమార్తెను, కన్నతల్లిని చంపేశాడు. ఆపై తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు ఓ ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం మధ్యాహ్నం ఈ విషాద ఉదంతం వెలుగులోకి వచ్చింది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. చెన్నైకి చెందిన ప్రతాప్ (34) అక్కడి ఓ కార్ల కంపెనీలో డిజైన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం తార్నాక ప్రాంతానికి చెందిన సింధూర (32)తో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఆధ్య ఉంది. సింధూరకు రెండు నెలల క్రితం హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమెతో పాటు ఆధ్య, ప్రతాప్ తల్లి రాజతి నగరానికి వచ్చారు. తార్నాకలోని రూపాలీ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నారు. చెన్నైలోనే ఉద్యోగం చేస్తున్న ప్రతాప్ వారాంతాల్లో ఇక్కడికి వచ్చి వెళ్తుండేవాడు. చెన్నై వెళదామనే విషయంపై కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

బెడ్రూంల్లో నిద్రిస్తుండగా..
చెన్నైలో స్థిరపడటానికి ఉద్యోగం వదిలి రావాలంటూ భార్య సింధూరపై ప్రతాప్ ఒత్తిడి తెస్తున్నాడు. దీనికి ఆమె అంగీకరించడంపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదాలు, గొడవలు జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ వీకెండ్‌లో రావడంతో శుక్రవారం ప్రతాప్ నగరానికి వచ్చాడు. చెన్నై వెళ్లే విషయమై రెండు రోజులుగా వీరి మధ్య గొడవలు జరిగి ఆదివారం రాత్రి తారస్థాయికి చేరింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ప్రతాప్.. కుటుంబాన్ని హతమార్చి తానూ తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున ప్రధాన బెడ్రూంలో నిద్రిస్తున్న భార్య, కుమార్తెను, కొద్దిసేపటి తర్వాత పక్కనే మరో బెడ్రూంలో పడుకుని ఉన్న తల్లినీ చంపివేశాడు. హాల్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు: సింధూర తల్లి జమున



'ప్రతాప్ మాకు దగ్గరి బంధువు హైదరాబాద్ నుంచి చెన్నై షిఫ్ట్ కావాలనే విషయంపై భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. కానీ.. ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదు' అని జమున మీడియాతో అన్నారు. రాజతి మెడపై ఉన్న గుర్తుల్ని బట్టి ఉరి బిగించి లేదా గొంతు నులిమి చంపినట్లు పోలీసులు భావిస్తున్నారు. సింధూర, ఆద్యల మృతికి కారణాన్ని స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. పోస్టుమార్టం పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక నివేదిక వచ్చిన తర్వాతే దీనిపై స్పష్టత వస్తుందని ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ తెలిపారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. సింధూర కోసం వాళ్ల ఆఫీస్ వారు వచ్చి చూసేదాకా ఇంతటి ఘోరం జరిగిందని నాకు తెలియదు. ఆమె ఫోన్ ఎత్తట్లేదు అని ప్రతాప్ కూడా స్పందించట్లేదని కంగారు పడుతూ వచ్చి చెప్పారు. ఎంత కొట్టినా తలుపులు కూడా తీయట్లేదని ఆందోళన చెందారు. అప్పుడు వచ్చి చూస్తే ఈ ఘోరం కనిపించింది. మేం పక్క అపార్ట్‌మెంట్లో ఉంటాం. ఏదైనా ఇబ్బంది అనిపిస్తే మా దగ్గరికి వస్తే సరిపోయేది కదా. ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు.

సింధూర సహోద్యోగులు ఫోన్ చేయడంతో..
సింధూర సోమవారం విధులకు హాజరుకావాల్సి ఉంది. ఆమె బ్యాంక్‌కు రాకపోవడంతో ఆరా తీసేందుకు సహోద్యోగులు ఫోన్ చేశారు. సింధూర నుంచి స్పందన రాకపోవడంతో మధ్యాహ్నం వరకు ప్రయత్నించారు. చివరకు మధ్యాహ్నం 2 గంటల సమయంలో సింధూర అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. ఎంత పిలిచినా లోపల నుంచి స్పందన లేకపోవడంతో పక్కన అపార్ట్‌మెంట్‌లో నివసించే సింధూర తల్లి జమునను తీసుకువచ్చారు. వీరికి ఫ్లాట్‌లోకి హాల్‌లో ఫ్యాన్‌కు వేలాడుతున్న ప్రతాప్ మృతదేహం కనిపించింది. బెడ్స్‌పై ఉన్న సింధూర, ఆద్యలను పరిశీలించారు. సింధూర కొన ఊపిరితో ఉండటంతో సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించి డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. చికిత్స ప్రారంభించడానికి ముందే ఆమె తుది శ్వాస విడిచింది.



'కంటి వెలుగు'కు సిద్ధం

- జిల్లా వ్యాప్తంగా 42 వైద్య బృందాల ఏర్పాటు
- పద్దెనిమిది ఏళ్లు దాటిన వారందరికీ పరీక్షలు
- అవసరమైన వారికి అద్దాలు, శస్త్రచికిత్సలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిఖిల

వికారాబాద్: శరీర భాగాలన్నింటిలో ముఖ్యమైనవి కళ్లు. ఇవి లేకపోతే సృష్టి అంధకారం. ముఖ్యంగా మనిషికి కళ్లు లేకపోతే అంతా శూన్యమే. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన కళ్లను రక్షించేందుకు ప్రభుత్వం 'కంటి వెలుగు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా నేత్ర సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి కంటి పరీక్షలు చేయాలనే లక్ష్యంతో యంత్రాంగం సన్నద్ధమవుతోంది. 19న ఈ కార్యక్రమాన్ని జిల్లాలో లాంఛనంగా ప్రారంభించనున్నారు.

వివరాల సేకరణ పూర్తి
వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని 20 మండలాల్లో 566 పంచాయతీలున్నాయి. మొత్తం జనాభా 9.27లక్షలు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, జీపీలు, అనుబంధ గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కోసం 42 వైద్య బృందాలను నియమించారు. ఒక్కో టీమ్‌లో ఎనిమిది మంది ఉంటారు. ఆశ వర్కర్లకు ముందస్తుగా అందజేసిన సర్వేపత్రాల ఆధారంగా గతంలోనే సమగ్ర సమాచారం సేకరించారు. కుటుంబ సభ్యులలో ఎవరికైనా డయాబెటీస్ (షుగర్), బీపీ, క్యాన్సర్‌తో పాటు ఇతరత్రా స్వల్ప, దీర్ఘకాలిక వ్యాధులేమైనా ఉన్నాయేమోనని ఆరాతీశారు. అదే విధంగా ఇంట్లో ఎవరికైనా ఇప్పటికే కంటి సమస్యలు ఉన్నాయా..? అద్దాలు వాడుతున్నారా..? కంటి ఆపరేషన్లు చేయించుకున్నారా..? అనే వివరాలను సేకరించారు.

నిత్యం 200 మందికి పరీక్షలు
ఈనెల 19వతేదీ నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమంలో ఎంపిక చేసిన గ్రామాల్లో నిత్యం 200 మందికి, పట్టణాల్లో 250 మందికి ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రతి శిబిరంలో వైద్యాధికారితో పాటు నేత్ర వైద్యుడు, సిబ్బంది కలిపి ఎనిమిది మంది ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి.. ఏ రోజున పరీక్షలకు రావాలో వార్డుల వారీగా తెలియజేయాలని అధికారులు ఆదేశించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో దశలవారీగా శిబిరాల వద్దకు వచ్చేలా పక్కా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఒకేసారి గుంపులుగా వస్తే పరీక్షలు చేయడానికి ఇబ్బందవుతుందనే ఉద్దేశంతో ఎవరు, ఏ సమయంలో రావాలో ముందుగా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణాల్లోని వార్డుల వారీగా వైద్య సిబ్బందిని నియమించారు. సోషల్ మీడియా, మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని నిర్ణయించారు. రేషన్ షాప్‌ల నిర్వాహకులకు కూడా ప్రచార బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. పోస్టర్లు, ఇతర ప్రచార సాధనాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

వసతుల కల్పన
నేత్ర పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, మందులు అందించి.. ఆపరేషన్లు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. చూపు మందగమనాన్ని చికిత్సలను నిర్ణయిస్తారు. అవసరమైన వారికి పంపిణీ చేయడానికి 39,767 రీడింగ్ కంటి అద్దాలు, మందులు ఇప్పటికే జిల్లాకు చేరాయి. వైద్య కేంద్రాలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా కనీస వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. శిబిరాల వద్ద టెంట్లు, మంచినీరు, కుర్చీలు తదితర వసతులను కల్పించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు జిల్లా సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నందున విజయవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

అవగాహన కార్యక్రమాలు..
వికారాబాద్ అర్బన్: జిల్లాలో ఈ నెల 19నుంచి నిర్వహించనున్న కంటి వెలుగును జయప్రదం చేయాలని కలెక్టర్ నిఖిల ఆదేశించారు. సోమవారం మంత్రి హరీశ్‌రావు, సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డీఆర్‌ఓ అశోక్‌కుమార్, డీఎంహెచ్‌ఓ పాల్వాన్‌కుమార్, డీపీఓ తరుణ్‌కుమార్, ఏఎస్పీ రషీద్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా నర్సింహారెడ్డి

- కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

కందుకూరు: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ కష్టపడి పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని సీతారామశాస్త్రి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం పార్టీ ఏ బ్లాక్ కమిటీ సభ్యుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టనున్న హాత్‌సే హాత్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా శ్రేణులు కదిలిరావాలన్నారు. ఈనెల 26న పార్టీ జెండాలు ఆవిష్కరించి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, బడంగ్‌పేట మేయర్ చిరిగింత పారిజాత, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, జి.ప్రభాకర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, మైనార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్, ఉపాధ్యక్షుడు ఖాజామోహినుద్దీన్, జిల్లా ప్రధానకార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ సులేమాన్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధానకార్యదర్శి తల్లోజు వినోద్‌చారి, సొసైటీ డైరెక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల వెంకటేశ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.గణేశ్‌నాయక్, తుక్కుగూడ అధ్యక్షుడు జంపన్న యాదవ్, ఎండీ అఫ్జల్, శివగల్ల యాదయ్య, వీరేష్, రాజు, రమేష్, జైపాల్‌రెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, బాబు, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పార్టీని కాపాడుకోవాలి
బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, ఇక్కడ పార్టీని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేటలో సోమవారం పార్టీ సభ్యుల బీ బ్లాక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి కూడా నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- పక్కా భవనాలు లేక అవస్థలు
- అసంపూర్తిగా పలు భవనాలు
- వికారాబాద్ మండలంలో మొత్తం 75 సెంటర్లు
- 43 ఫ్రీ రెంట్, 13 అద్దె భవనాల్లో కొనసాగింపు



వికారాబాద్‌లోని గరీబ్‌నగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు అంగన్‌వాడీ సెంటర్లు సొంత భవనాలకునోచుకోవడం లేదు. కొన్ని ఇళ్లలో, మరికొన్ని దాతలు ఇచ్చిన చిన్నపాటి గదుల్లో కొనసాగుతుండగా.. ఇంకొన్ని పాఠశాలలు, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లలో నడుస్తున్నాయి. చిన్నారుల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం అంగన్‌వాడీలకు పక్కా భవనాలు నిర్మించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి.

స్థలం సరిపోక ఇబ్బందులు
బాల్య దశలో చిన్నారులను చదువుకు సన్నద్ధం చేయడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్‌వాడీ సెంటర్లు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రతీ గ్రామంలో ఇవి కొనసాగుతున్నా.. మెజార్టీ సెంటర్లకు సొంత భవనాలు దిక్కులేవు. దీంతో సరైన వసతులు లేక చిన్నారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలు సైతం వస్తుంటారు. వీరికి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని వీటి ద్వారానే అందజేస్తున్నారు. ఇక్కడే వ్యాక్సినేషన్ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. దీంతో స్థలం సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న చిన్నపాటి గదుల్లోనే అందరూ ఒకే గదిలో కూర్చోవాల్సి వస్తోంది. అద్దె భవనాలు, ఫ్రీ రెంటెడ్ కేంద్రాల్లో చాలా వరకు ఆటస్థలాలు లేవు. చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. సెంటర్లు కొనసాగుతున్న ప్రైవేటు భవనాలకు గ్రామాల్లో నెలకు రూ.750, పట్టణాల్లో రూ.3 వేల అద్దె చెల్లిస్తున్నారు. పూర్తి వసతులు ఉన్నవాటికి మాత్రమే ఇది వర్తిస్తుంది. వసతులు లేని కేంద్రాలకు అద్దె తక్కువగా ఇస్తున్నారని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

20 కేంద్రాలకు పక్కా భవనాలు
వికారాబాద్ మున్సిపల్, మండల పరిధిలో మొత్తం 75 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 20 సెంటర్లకు మాత్రమే పక్కా భవనాలున్నాయి. ఇందులోనూ కొన్ని పాతబడ్డాయి. 43 కేంద్రాలు ఉచిత భవనాల్లో కొనసాగుతున్నాయి. దాతల ఇళ్లు, జీపీలు, స్కూళ్లు, కమ్యూనిటీ సెంటర్లలో వీటిని నిర్వహిస్తున్నారు. 13 భవనాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. వీటితో పాటు దాతలు ఇచ్చిన గదుల్లో సైతం ఎలాంటి మౌలిక వసతులు లేవు. తప్పని పరిస్థితిలో సెంటర్లను కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైనా పక్కా భవనాలు నిర్మించి ఇవ్వాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం
మున్సిపల్, మండలంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంది. ప్రస్తుతం సెంటర్లలో చిన్నారులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.
– వెంకటేశ్వరమ్మ, సీడీపీఓ, వికారాబాద్

క్లుప్తంగా

జాతి వైరం మరచి..


కుక్క పిల్లలకు పాలు ఇస్తున్న వరాహం

బొంరాస్‌పేట: జాతి వైరం మరచి ఓ వరాహం కుక్క పిల్లలకు పాలిస్తోంది. ఈ అరుదైన సంఘటన బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల గ్రామంలో చోటుచేసుకుంది. వాస్తవానికి వరాహం కనిపిస్తే శునకాలు వెంటపడి దాడి చేసేందుకు యత్నిస్తాయి. పందులు కూడా ప్రతిదాడికి సిద్ధమవుతాయి. కానీ ఓ వరాహం నిత్యం కుక్క పిల్లలకు పాలిస్తోంది. దీన్ని స్థానికులు వింతగా చూస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

పరిగి: అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పరిగి పట్టణ కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. పరిగి మున్సిపల్ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న వినోద్‌కుమార్ ఆదివారం రాత్రి బైక్‌పై భవాని హోటల్ నుంచి ఎక్స్ రోడ్డుకు వస్తుండగా అతివేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు నగరానికి తరలించారు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మొగులయ్యకు సన్మానం


మొగులయ్యను సన్మానిస్తున్న పోలీసులు

తలకొండపల్లి: తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో పద్మశ్రీ కిన్నెర మొగులయ్యను సన్మానించారు. మరుగున పడ్డ జానపద కళలకు ప్రాణంపోసి దేశ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన మొగులయ్యకు ఇటీవల భారత ప్రభుత్వం పద్మశ్రీ బిరుదు ఇచ్చి సత్కరించింది. ఈ సందర్భంగా సోమవారం తలకొండపల్లి పీఎస్‌లో ప్రజాప్రతినిధులు, పోలీసులు.. మొగులయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నర్సింలు శెట్టి, హెడ్ కానిస్టేబుల్ మహేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సోదరభావం

పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న చెన్నకేశవరెడ్డి, ఇంద్రసేనారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడలు సోదరభావాన్ని పెంపొందిస్తాయని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి తెలిపారు. పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల శాఖ ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపల్‌లోని బిగ్ బ్యాట్ క్రికెట్ గ్రౌండ్‌లో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలకు సమయం కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల ఏఈ ఇంద్రసేనారెడ్డి, పరమేష్, జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు వెంకట్‌రెడ్డి, రాజు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గేదెల పంపిణీ హుళక్కేనా?

'పాడి'తోనైనా బతుకుకు ఆసరా దొరుకుతుందని ఆశించిన రైతన్నలకు నిరాశే ఎదురవుతోంది. పాడి పశువుల పంపిణీ పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. ఎస్సీలు సాధికారత దిశగా పయనించేందుకు 2021 అక్టోబర్ మాసంలో ప్రభుత్వం పాడి పశువుల పంపిణీ పథకం తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఎస్సీ కుటుంబాలకు రెండు చొప్పున పాడి పశువులు అందించాలని నిర్ణయించారు. అందులోభాగంగా లబ్ధిదారులను సైతం ఎంపిక చేశారు. అన్ని ప్రక్రియలు పూర్తిచేసినా పాడి పశువులను పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారుల్లో అయోమయం నెలకొంది.

- ఏడాదిగా లబ్ధిదారుల ఎదురుచూపులు
- నేటికీ ఒక్క యూనిట్ కూడా గ్రౌండింగ్ కాని దుస్థితి
- పైలెట్ ప్రాజెక్టు కింద ఎస్సీ నియోజకవర్గాల ఎంపిక
- మొదటి విడతగా జిల్లాకు 255 యూనిట్లు మంజూరు



వికారాబాద్: ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా 2021–22 ఆర్థిక సంవత్సరానికి గాను వన్ ప్లస్ వన్ పాడి పశువుల పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ముందుగా ఎస్సీ నియోజకవర్గాల్లో ఈ పథకం అమలు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని నవాబుపేట మండలానికి ఈ పథకం వర్తింపజేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఆరు మండలాల్లో కూడా పాల సేకరణకు అనువైన గ్రామాలను సైతం గుర్తించి పథకం అమలు చేయాలని ప్లాన్ చేశారు. ఈ పథకం ద్వారా పాడి పశువులు తీసుకున్న లబ్ధిదారులు విజయ డెయిరీకి పాలు విక్రయించేలా నిబంధనలు కూడా విధించారు. అంతేకాదు పాడి రైతును ప్రోత్సహించేందుకు ఇస్తున్న లీటరు పాలకు రూ. 4 అదనంగా వర్తించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే ప్రక్రియ జరిగి ఏడాది దాటినా నేటికీ ఒక్క యూనిట్ కూడా గ్రౌండింగ్ కాలేదంటే పథకం అటకెక్కిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మొదటి విడతలో 255 యూనిట్లు

ఎస్సీ కుటుంబాలకు రాయితీపై పాడి పశువులను అందజేయాలని ప్రణాళిక రూపొందించిన ప్రభుత్వం ఒక్కో యూనిట్ కాస్ట్ రూ.2 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో ఒక్కో యూనిట్‌కు 70 శాతం రూ. 1,40,000 రాయితీ ప్రభుత్వం భరించనుండగా మరో 30 శాతం నిధులు రూ.60,000 బ్యాంకుల ద్వారా రుణం రూపంలో ఇవ్వనున్నారు. మొదటి విడతలో జిల్లాలో మొత్తం 255 యూనిట్ల పాడి పశువులు ఇవ్వనున్నారు. ఇందులో వికారాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 215 యూనిట్లు, నవాబుపేట మండల పరిధిలోని గ్రామాలకు 40 యూనిట్లు ఈ పథకం కింద అందజేయాలని నిర్ణయించారు. ఈ పథకం కింద మొదటి విడతలో జిల్లాకు 510 పాడి పశువులు రావాల్సి ఉంది. ఒక్కో యూనిట్‌కు రూ. 2 లక్షల చొప్పున మొదటి విడతలో ఈ పథకానికి జిల్లాలో మొత్తం రూ. 5.10 కోట్లు ఖర్చు చేయనుండగా ఇందులో ప్రభుత్వం రాయితీ రూపంలో రూ. 4.08 కోట్లు భరించేలా ప్లాన్ చేశారు. మిగతా 30 శాతం నిధులు రూ. 1.02 కోట్లు బ్యాంకుల ద్వారా రుణం రూపంలో ఇప్పించేలా నిబంధన విధించారు. అయితే లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవడం, ఎంపిక చేయడం తదితర ప్రక్రియలన్నీ పూర్తి చేసిన ప్రభుత్వం నేటికీ పశువులను మాత్రం ఇవ్వడంలేదు.

ఎంపికైన గ్రామాలివే..

- వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని సిద్దులూరు, పీరంపల్లి, పులుసుమామిడి, గొట్టిముక్ల, సర్పన్‌పల్లి, మైలార్‌దేవరంపల్లి, పీలారం, బురాన్‌పల్లి గ్రామాలను ఎంపిక చేశారు.
- మర్పల్లి మండల పరిధిలోని మర్పల్లి, బూచన్‌పల్లి, రావులపల్లి, పట్లూరు, సిరిపురం గ్రామాలు.
- బంట్వారం మండల పరిధిలోని బంట్వారం, రొంపల్లి, మంగ్రాస్పల్లి, నాగవరం గ్రామాలు పథకం కింద ఎంపిక చేసిన జాబితాలో ఉన్నాయి.
- కోట్‌పల్లి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని బార్వాద్, కరీంపూర్, మోత్కుపల్లి, జిన్నారం, బీరోల్ గ్రామాలను ఎంపిక చేశారు.
- దారూరు మండల కేంద్రంతో పాటు రుద్రారం, గట్టెపల్లి, కుక్కింద, అల్లీపూర్, హరిదాస్‌పల్లి, నర్సాపూర్, కెరవెల్లి, ఎబ్బనూరు, మున్నూరుసోమారం, తరిగోపుల, మైలారం, నాగారం, కుమ్మరిపల్లి, మోమిన్‌కలాన్, నాగసముందర్, రాజాపూర్, గురుదొట్ల, అంపల్లి గ్రామాలు ఉన్నాయి.
- మోమిన్‌పేట్ మండల పరిధిలోని బాల్‌రెడ్డిగూడ, చీమల్‌దరి, చక్రంపల్లి, దేవరంపల్లి, ఎన్కెతల, గ్రామాలు.
- నవాబుపేట మండల పరిధిలోని ఆర్కతల, చించల్‌పేట్, మీనపల్లి కలాన్, యావాపూర్ గ్రామలు ఈ పథకం కింద ఎంపిక చేశారు.

నిధులు వస్తే అమలు చేస్తాం



వన్‌ప్లస్ వన్ పాడి పశువుల పథకంలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. అయితే ఈ పథకానికి సంబంధించి ఇంకా నిధులు విడుదల కాలేదు. నిధులు వచ్చిన వెంటనే పథకం అమలు చేస్తాం.

– బాబుమోజెస్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

బీజేపీతోనే దేశం అభివృద్ధి

పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్


బండమీదిపల్లి గ్రామంలో బీజేపీ జెండావిష్కరణ

పెద్దేముల్: బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందుతోందని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు సందీప్‌కుమార్ అధ్యక్షతన మండల పరిధిలోని బండమీదిపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. యువత, ప్రజలు చైతన్యవంతమై బీజేపీకి ఓటేసి మద్దతివ్వాలని కోరారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే యువత ఉద్యోగాలు వస్తాయని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరణలు చేపట్టి బీజేపీని గ్రామ స్థాయినుంచి బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, ప్రదీప్, మండల ఇన్‌చార్జి బంట్వారం భద్రేశ్వర్, బీజేపీ సీనియర్ నాయకుడు మనోహర్‌రావు(అడ్వకేట్), పూజారి పాండు, గాజుల కుమార్, విక్రమ్‌రెడ్డి, నర్సింహ భూమో, రమేశ్ సాగర్, ప్రవీణ్‌కృష్ణ, రాములు, యువకులు పాల్గొన్నారు.

ప్రమాదంపై పలువురు దిగ్భ్రాంతి


బాధితులతో మాట్లాడుతున్న శుభప్రద్‌పటేల్

వికారాబాద్ అర్బన్: ఒకే కుటుంబానికి చెందిన నలుగురు యువకులు ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృత్యువాత పడడంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి, ఎంపీ స్పందించి ఎస్పీ కోటిరెడ్డితో మాట్లాడారు. మృతదేహాలను త్వరగా బయటకు తీసి, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించాలని సూచించారు. బాధిత కుటుంబీకులకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌లు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి కుటుంబీకులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు యువకులు మృతిచెందడం బాధారమన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం

- పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి


కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మాడ్గుల: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి పాత్ర మరువలేనిదని పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి అన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత, దివంగత సూదిని జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం మాడ్గులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న జైపాల్‌రెడ్డి విగ్రహానికి ప్రజాప్రతినిధులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మారెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్యగౌడ్, ఎంపీటీసీ సభ్యులు కిషన్‌రెడ్డి, కొత్తపాండుగౌడ్, జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జంగయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, లక్ష్మయ్య, అభిమానులు పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దివంగత సూదిని జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో జై పాల్‌రెడ్డి జయంతి వేడుకలరు సోమవారం ఘనంగా జరిపారు. జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయ క్ , మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మండ్లీరాములు, నాయకులు ఖలీల్, వెంకటేశ్, మానయ్య, బీచ్యనాయక్, శ్రీశైలం, హీరాసింగ్, ఇమ్రన్, ఖాదర్, కరీం ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం


ఆనంద్‌కు నియామక పత్రం అందజేస్తున్న మహేశ్, సుబ్రహ్మణ్యం

- రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

షాబాద్: ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దామని అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర కార్యదర్శి బేగరి మహేశ్, జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండలం బోడంపహాడ్ గ్రామంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన కళ్లెం ఆనంద్‌ను మండల కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసమానతల సమాజంలో సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకొని సమాజ హితం కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బోడంపహాడ్ గ్రామ నాయకులు యాదయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అధ్యక్షుడిగా శ్రీనివాస్

అంబేడ్కర్ సంఘం బోండపహాడ్ గ్రామ అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చర్లగూడెం శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా శేఖర్, కార్యదర్శిగా రవికిరణ్, కోశాధికారిగా నరేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బందేశ్వర్, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సభ్యులు నర్సింహులు, ఎండీ రఫీక్, వెంకటేష్, శ్రీనివాస్, ఎండీ ఇనాయత్, కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కంటి వెలుగుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా వైద్యం, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తామని, అవసరం ఉన్న వారికి కంటి ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజు, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, డీఎల్‌పీఓ అనిత పాల్గొన్నారు.

'డయల్ యువర్ చైర్‌పర్సన్'కు 9 ఫిర్యాదులు

వికారాబాద్ అర్బన్: పట్టణంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తెలిపారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమంలో 9 ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. గతవారం వచ్చిన 20 ఫిర్యాదులో ఆరు సమస్యలను పూర్తిగా పరిష్కరించామన్నారు. మరో పది ఫిర్యాదులు నిధులతో కూడినవి కావడంతో పరిష్కరించేందుకు కొంత సమయం పడుతుందన్నారు. సోమవారం వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించి పరిష్కరించారు. రాజీవ్ గృహకల్ప వద్ద రెండు ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా మారినట్లు ఫిర్యాదు రావడంతో వెంటనే అక్కడికి వెళ్లిన చైర్‌పర్సన్ మున్సిపల్, ఆర్ అండ్‌బీ అధికారులతో మాట్లాడి వెంటనే తొలగించాలని సూచించారు. ఆమె వెంట మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

గాలిపటం ఎగురవేస్తుండగా..

భవనం పైనుంచి పడి కూలీ మృతి

మీర్‌పేట: గాలిపటం ఎగురవేస్తూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడి ఓ కూలీ మృతి చెందిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన కత్తి నాగార్జున(38) హస్తినాపురం విశ్వేశ్వరయ్య కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పనిచేస్తున్నాడు. ఆదివారం నిర్మాణంలో ఉన్న భవనం 6వ అంతస్తుపై చిన్నారులతో కలిసి గాలిపటం ఎగురవేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలపు వల

హనీ ట్రాప్‌తో నిలువు దోపిడీ

- అమాయకులను గుర్తించి యువతులతో ఎర
- వారితో మాటలు కలిపి చాటింగ్స్, ఫొటోలు
- వీటిని బాధితులకు చూపించిన బెదిరింపులు
- 13 మందితో ఏర్పడిన ఘరానా ముఠా
- మహిళ మినహా మిగిలిన వారి అరెస్టు
- నిందితుల్లో ఓ మాజీ హోంగార్డు, బౌన్సర్



సాక్షి, సిటీబ్యూరో: ఓ ప్రాంతానికి చెందిన చోటామోటా వ్యాపారుల్లో అమాయకులను ఎంచుకోవడం... యువతులతో వారికి ఎర వేసి ఫొటోల వరకు తీసుకువెళ్లడం... వాటితో యువతుల బంధువులుగా రంగంలోకి దిగడం ... దాడులు, బెదిరింపులతో భయభ్రాంతులకు గురి చేసి అందినకాడికి దండుకోవడం.. ఈ పంథాలో రెచ్చిపోతున్న 'హనీట్రాప్స్ బందిపోటు' ముఠాను ముషీరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. అరెస్టైన 12మందిలో ఓ మాజీ హోంగార్డు, బౌన్సర్ ఉన్నట్లు మధ్య మండల డీసీపీ ఎం.రాజేష్ చంద్ర తెలిపారు. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరితో కలిసి సోమవారం వివరాలు వెల్లడించారు.

హోంగార్డుగా పని చేస్తూ నేరాలు...

ముషీరాబాద్ పరిధిలోని దయారా మార్కెట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ విఖార్ మెహ్దీ గతంలో నగర భద్రతా విభాగంలో హోంగార్డుగా పని చేశారు. 2013లో పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ, బెదిరింపులకు పాల్పడి జైలుకు వెళ్లాడు. 2016లో నోట్ల రద్దు తర్వాత పాత నోట్లకు కొత్త నోట్లు మార్పిడి పేరుతో దందా చేసి పలువురిని మోసం చేశాడు. దీనిపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో మరోసారి జైలుకు వెళ్లాడు. ఇతడి నేరచరిత్రను పరిగణలోకి తీసుకున్న ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించారు. విఖార్ జైల్లో ఉండగా తలాబ్‌కట్టకు చెందిన మహ్మద్ ఇమ్రాన్ ఖాన్‌తో పరిచయమైంది. వీళ్లిద్దరూ కలిసి పంజగుట్టలో విఖార్‌తో కలిసి అరెస్టు అయిన సంతోష్‌నగర్ వాసి మహ్మద్ కలీం ఖాన్, ముషీరాబాద్‌కు చెందిన పాత నేరగాడు, విఖార్ సోదరుడైన సిరాజ్ జట్టు కట్టారు. పహాడీ షరీఫ్, మెహదీపట్నం ప్రాంతాలకు చెందిన షేక్ సమీర, సైదా ఫాతిమా, మహ్మద్ ఇస్మాయిల్, అలీ, మజీద్ అహ్మద్, అహ్మద్ రిజ్వాన్, సయ్యద్ రఫీఖ్, షేక్ బషీర్, స్టేజ్ డ్యాన్సర్ హీనాలతో ముఠా ఏర్పాటు చేశారు.

చిరు వ్యాపారులను ఎంపిక చేసుకుని...

ఈ గ్యాంగ్‌లోని పురుషులు తమ ప్రాంతాల్లోని చిరు వ్యాపారుల్లో అమాయకులను టార్గెట్‌గా చేసుకుంటారు. వీరి ద్వారా విషయం తెలుసుకునే ముఠాలోని యువతులు, మహిళలు అతడి వద్దకు వెళ్తారు. ఆయా వ్యాపారాలకు సంబంధించి ఆర్డర్లు ఇవ్వడానికంటూ వ్యాపారుల ఫోన్ నెంబర్లు తీసుకుంటారు. ఆపై వారికి వాట్సాప్‌లో సందేశాలు పంపి చాటింగ్స్ చేస్తారు. ఓ ప్రాంతంలో కలుసుకోవడానికి రమ్మని పిలిచి వారితో ఫొటోలు దిగుతారు. ఈ ఫొటోలను తీసుకుని ముఠా సభ్యులు అసలు కథ మొదలెడతారు. ఆ వ్యాపారి వద్దకు వెళ్లి సదరు మహిళ తమ భార్య లేదా కాబోయే భార్య అని చెప్పి, ఆమెను లోబరుచుకుంటున్నావని బెదిరించి దాడి చేస్తారు. పోలీసులుగా ఎంట్రీ ఇచ్చే విఖార్, ఇమ్రాన్‌లు కేసుల పేరుతో, విలేకరి రూపంలో వచ్చే రిజ్వాన్ ఫొటోలు మీడియాలో వైరల్ చేస్తానంటూ బెదిరిస్తాడు. దీంతో వారు సదరు వ్యక్తి నుంచి భారీ మొత్తం డిమాండ్ చేసి అందినకాడికి దండుకుంటారు.

మూడు ఠాణాల్లో నాలుగు కేసులు...

ఈ ఏడాది జూన్ నుంచి నేరాలు చేస్తున్న ఈ గ్యాంగ్‌పై ఇప్పటి వరకు ఆసిఫ్‌నగర్, సంతోష్‌నగర్, ముషీరాబాద్‌ల్లో కేసులు నమోదయ్యాయి. ముషీరాబాద్‌కు చెందిన ఖమ్రుద్దీన్‌ను రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. వీరి వేధింపులు తట్టుకోలేక అతడు తన ఇంటిని తాకట్టు పెట్టి రూ.5 లక్షలు ఇచ్చాడు. ఇదే ప్రాంత వాసి ఖలీల్ పాషా రూ.2.5 లక్షలు మరో ఇద్దరి నుంచి ఇంకొంత రాబట్టారు. ఇలా మొత్తం రూ.8.5 లక్షలు కాజేసిన, బెదిరింపులకు డమ్మీ పిస్టల్స్, కత్తులు వాడే వీరిపై ముషీరాబాద్‌లో బందిపోటు దొంగతనం సహా వివిధ ఆరోపణలపై కేసులు నమోదయ్యాయి. చిక్కడపల్లి ఏసీపీ ఎస్. యాదగిరి నేతృత్వంలో రంగంలోకి దిగిన నాలుగు బృందాలు హీనా సహా మిగిలిన 12 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.5 లక్షల నగదు, రెండు డమ్మీ తుపాకులు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కస్టడీ కోసం పిటిషన్ దాఖలు చేశారు. వీరిలో అర్హులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని, వీరి బారినపడిన బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకు రావాలని డీసీపీ రాజేష్ చంద్ర కోరారు.

గోదాదేవికి తిరుమంజనం


విశేష అలంకరణలో గోదాదేవి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన స్థానిక పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి ఆస్థానం నిర్వహించారు. భూదేవి శ్రీదేవి సమేత శ్రీనివాసునికి ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలోకి తెచ్చి విశేష అర్చనలు నిర్వహించారు. బెల్లం పొంగలి ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు గోవుకు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. నాలుగు మాడ వీధుల్లో తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. పాలు, పెరుగు తేనె, నెయ్యి, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అమ్మవారి నోము నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.


అమ్మవారి తిరుచ్చి ఉత్సవం


అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు